అసైన్డ్ భూంఫట్!

మొదటిపేజీ తరువాయి...

నుంచే దూసుకుపోనున్నాయి. మరి.. పడావు పడిన ఆ భూముల్లో ఇప్పుడు సిరులు పండి పేదోళ్లు పెద్దోళ్లు కావాలి. అదే జరిగితే బ్రహ్మాండం బద్దలై... భూమి-ఆకాశం ఏకమవుతుంది కదా. అందుకే ఆ విపత్తు రాకుండా పెద్దోళ్లు రంగంలోకి దిగారు. పేదోళ్ల చేతుల్లో భూములను మాయం చేస్తున్నారు. అడ్డికి పావుసేరులా అనధికారికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఒకటీ అరా కాదు సుమా! గత నాలుగైదు నెలల్లోనే వందల ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములను కొందరు పెద్దలు బినామీ పేర్లతో పాటు సూట్‌కేస్ కంపెనీల పేరిట చెరపడుతున్నారు. ఒకవైపు హైదరాబాద్‌లో రియల్ రంగం వెలవెలబోతూ, హైడ్రా బుల్డోజర్లు హడావుడి చేస్తుంటే.. మరోవైపు పాలకులు ప్రకటించిన ఫోర్త్ సిటీ పరిధిలో మాత్రం నిబంధనలకు పాతర వేస్తూ పేదోళ్ల భూముల్లో పెద్దలు వాలిపోతున్నారు. ఇందుకు సర్వీసులో ఉన్న వారితో పాటు పదవీ విరమణ పొందిన పలు శాఖల ఉన్నతాధికారులూ అతీతం కాకపోవటం శోచనీయం.

పేదోళ్ల భూములన్నీ పెద్దోళ్లపరం

గత 9 నెలలుగా రాష్ట్రంలో రియల్-నిర్మాణ రంగం కుదేలైందని సర్వేలు ఘోషిస్తున్నాయి. ట్రై సిటీల్లో ఒక్క మెగా నిర్మాణ ప్రాజెక్టు మొదలైన దాఖలాలు లేవు. ఇక్కడ రియల్-నిర్మాణ రంగం దివాలా తీస్తే.. ఫోర్త్ సిటీలో మాత్రం అనధికారిక రియల్ రంగం మాత్రం జోరు మీదున్నది. గత నాలుగైదు నెలలుగా గుట్టుగా సాగుతున్న ఈ భూ దందాలో పేదోళ్ల భూములన్నీ పెద్దోళ్ల పరం అవుతున్నాయి.

- ఫోర్త్ సిటీ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 9లో వందల ఎకరాల్లో అసైన్డ్ భూములు ఉన్నాయి. వీటికి ఇప్పటికే రేటు నిర్ధారించి, అడ్వాన్స్ కూడా చెల్లించినట్టు తెలిసింది. ప్రభుత్వ పెద్ద ఒకరు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఉన్నది. బాండ్ పేపరుపై 99 ఏండ్ల లీజు ప్రాతిపదికన భూమి ఇస్తున్నట్టు అసైన్డ్‌దారుల నుంచి ఒప్పంద పత్రం రాయించుకున్నట్టు సమాచారం.
- లేమూరు గ్రామ పరిధిలో 65 ఎకరాల అసైన్డ్ భూములను మాజీ పోలీస్ ఉన్నతాధికారి ఒకరు రూ.కోటికి ఎకరం చొప్పున కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇక్కడే మరో 80 ఎకరాల వరకు అందుబాటులో ఉండటంతో బ్రోకర్లు ఎకరా కోటిన్నరకు ఇప్పించేందుకు బేరసారాలు సాగిస్తున్నారు.
- మహేశ్వరం మండలం సరస్వతిగూడ-లేమూరు దారిలో వంద ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు చేతులు మారినట్టు తెలిసింది. ఇక్కడ ఎకరాకు రూ.40-60 లక్షలకు కొంటున్నారు.
- కందుకూరు మండలం మంఖాల్ పరిధిలో ఇప్పటికే 47 ఎకరాల లావణి పట్టా చేతులు మారి పట్టాగా రూపాంతరం చెందిన విషయం తెలిసిందే. వీటికి సమీపంలోనే ఉన్న మరికొన్ని అసైన్డ్ భూములకు కూడా కొందరు పెద్దలు అడ్వాన్స్ ఇచ్చినట్టు తెలిసింది.
- హర్షగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో కూడా ఇప్పటికే అసైన్డ్ భూములు చేతులు మారాయి.
- ఫోర్త్ సిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పెద్దకు చెందిన సమీప బంధువు (ఎన్నారై)కు ఏకంగా 600 ఎకరాల భూములు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి.

నెమ్మదిగా మారుతున్న రికార్డులు

కొందరు ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే అసైన్డ్ భూముల కొనుగోళ్ల ప్రక్రియ జోరుగా సాగుతున్నట్టు ఆరోపణలున్నాయి. తొలుత గ్రామంలోని ఒకరిద్దరు బ్రోకర్లను రంగంలోకి దింపి.. రోడ్డువైపున ఉన్న అసైన్డ్ భూముల వారిని మచ్చిక చేసుకుంటున్నారు. వారికి కొంత రేటు ఎక్కువ ఇచ్చి ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే దాని వెనక భూముల వారిని బ్రోకర్లు సంప్రదిస్తున్నారు. వీరికి తక్కువ ధర చెప్తున్నారు. ఎవరైనా రైతులు ఇవ్వబోమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు తెలిపారు. దీంతో తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు. ఈ ప్రక్రియ 99 ఏండ్ల లీజు ఒప్పందంపై చేస్తున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయాల్లో ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులను మాయం చేస్తున్నట్టు సమాచారం. ఇందులో కొన్ని ఏండ్లుగా పట్టాగా నమోదు అయ్యాయని చూపి.. దాన్ని ఆసరాగా చేసుకొని ఆ భూములన్నీ పట్టాగా మార్చేందుకు పావులు కదుపుతున్నారు.

కొత్త అలైన్‌మెంట్ వద్దే వద్దు

ట్రిపుల్ ఆర్ పట్టా భూముల మీదుగా వెళ్తే తీవ్ర నష్టమని రైతుల ఆవేదన

- సుమారు 200 ఎకరాలపాటు కోల్పోతున్నామని ఆందోళన
- అలైన్‌మెంట్ మార్చకపోతే ఉద్ధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరిక
- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు నవాబుపేట్ అన్నదాతల వినతి

ఆర్ఆర్ఆర్ కొత్త అలైన్‌మెంట్ మార్చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న నవాబుపేట్ మండల రైతులు

వికారాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా మీదుగా వెళ్లనున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కొత్త అలైన్‌మెంట్ వద్దేవద్దని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్త అలైన్‌మెంట్‌తో పెద్ద మొత్తంలో పట్టా భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పాత అలైన్‌మెంట్ 75 శాతం మేర ప్రభుత్వ, బీడు భూముల మీదుగా వెళ్తే.. కొత్త అలైన్‌మెంట్ వల్ల ఒక్క నవాబుపేట్ మండలంలోనే 200 ఎకరాల వరకు పట్టా భూములను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పెద్దల కోసం, వెంచర్ల యజమానులకు నష్టం రాకుండా పాత అలైన్‌మెంట్‌ను మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్ వద్ద నవాబుపేట్ మండల రైతులు ధర్నా చేపట్టారు. ఆర్ఆర్ కొత్త అలైన్‌మెంట్ ప్రకారం ఒకట్రెండు ఎకరాలున్న రైతులు పూర్తిగా భూములను కోల్పోవాల్సి వస్తుందని, వెంటనే కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం.. వికారాబాద్ జిల్లాలోని పూడూర్, వికారాబాద్, నవాబుపేట్, మోమిన్‌పేట్ మండలాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వెళ్లనుందని, ఈ గ్రామాల్లో భూముల ధరలు ఎకరం రూ.కోట్లలో ఉన్నాయని, భూములు కోల్పోతే ప్రభుత్వం అందజేసే అరకొర సాయంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. నవాబుపేట్ మండలంలోని పులిమామిడి, లింగంపల్లి, చీమలదరి, మాదిరెడ్డిపల్లి, నారాగూడెం, పూలపల్లి గ్రామాల్లో ఎకరం రూ.2 కోట్లకుపైగా ఉండటంతో కొత్త అలైన్‌మెంట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కొత్త అలైన్‌మెంట్‌ను ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఇక నవాబుపేట్ మండలంలో పూలు, కూరగాయలను అధికంగా సాగు చేస్తారని, పులిమామిడి, లింగంపల్లి, చీమలదరి, మాదిరెడ్డిపల్లి, నారాగూడెం, పూలపల్లి గ్రామాల్లో పండించే కూరగాయలను హైదరాబాద్‌కు తరలిస్తారని, ఈ గ్రామాల్లో ఐదెకరాలోపు ఉన్న రైతులంతా కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతే ఆయా గ్రామాల రైతులు రోడ్డున పడటంతో పాటు హైదరాబాద్‌కు కూరగాయల కొరత కూడా ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మేం ఒప్పుకునేది లేదు

ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు. ప్రభుత్వం ముందుకెళ్తే మేం తీవ్రంగా ఉద్యమిస్తాం. పాత అలైన్‌మెంట్ ప్రభుత్వ భూముల మీదుగా వెళ్లింది. ఏం జరిగిందో ఏమో తూర్పువైపు మార్చడంతో పట్టా భూములు కోల్పోవాల్సి వస్తుంది. ఏడాదికి మూడు పంటలు పండే భూములున్నాయి. బావులు, బోర్లు ఉన్నాయి. కేవలం రైతులకే కాదు.. హైదరాబాద్‌కు కూరగాయల కొరత ఏర్పడుతుంది.

-భూపతిరెడ్డి, పులిమామిడి

రోడ్డున పడుతాం

రింగ్‌రోడ్డు పాత అలైన్‌మెంట్‌తో ప్రభుత్వ భూములు, బీడు భూములు పోయేవి. కొత్త అలైన్‌మెంట్‌తో పట్టా భూములు, బోర్లు, బావులు కోల్పోతాం. మాకు వేరే దగ్గర భూము లు లేవు. ఈ భూముల మీదనే ఆధారపడి బతుకుతున్నాం. మాకు ఉన్న ఐదెకరాల భూమిని ట్రిపుల్ ఆర్‌తో కోల్పోతే మా కుటుంబమంతా రోడ్డున పడుతుంది. కొత్త అలైన్‌మెంట్‌ను మార్చి పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించాలి.

-గవ్వల మొగలయ్య, మాదిరెడ్డిపల్లి, నవాబుపేట్ మండలం

మాకేం ఆధారం లేదు

మా భూమి దగ్గర సర్వే నంబర్ 172 అని గుర్తు వేశారు. మాకున్న మొత్తం ఐదెకరాల భూమి పోతదని ఇంటిల్లిపాది తిండితిప్పలు లేకుండా ఆందోళనతో ఉన్నాం. చదువుకున్నాం కానీ ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదు. మాకు ఉన్న ఐదెకరాలపైనే మా కుటుంబమంతా ఆధారపడి జీవిస్తున్నది. ఏటా మూడు పంటలు పండిస్తున్నాం. ఈ భూములు పోతే మాకేం ఆధారం లేదు. పాత అలైన్‌మెంట్‌ను అమలు చేయాలి.

-కల్వగురి రాఘవేందర్, మాదిరెడ్డిపల్లి, నవాబుపేట్ మండలం

రైతుల జోలికి రావొద్దు

ట్రిపుల్ ఆర్ కోసం పూలపల్లిలో ఎస్-168 నుంచి ఎస్-174 వరకు గుర్తులు వేశారు. మాకు ఆందోళనగా ఉంది. కొత్త అలైన్‌మెంట్‌కు కొద్ది దూరం నుంచే ప్రభుత్వ భూములున్నాయి కాబట్టి.. ప్రభుత్వ భూముల మీదుగా వెళ్తే అందరం ఆహ్వానిస్తాం. పట్టా భూములున్న రైతుల జోలికి రావొద్దు. ఒకవేళ మా డిమాండ్‌ను కాదని సర్కారు ముందుకెళ్తే.. రైతులమంతా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

-మాణిక్‌రెడ్డి, పూలపల్లి, నవాబుపేట్ మండలం

సమస్యల సాధనకు రెండు జేఏసీలు

- ఏకమైన గురుకుల టీచర్ల సంఘాల నాయకులు
- పరిష్కారం కోసం సర్కారుతో సంప్రదింపులు
- వేర్వేరు పద్ధతుల్లో డిమాండ్లు సాధించుకుంటామంటున్న ఇరువర్గ జేఏసీ నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సంక్షేమ శాఖ గురుకులాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి గురుకుల టీచర్ల సంఘాలన్నీ ఏకమయ్యాయి. వేర్వేరు పద్ధతుల్లో డిమాండ్లు సాధించుకునేందుకు రెండు జేఏసీలుగా ఏర్పడ్డాయి. సమస్యల పరిష్కారానికి సొసైటీలవారీగా పలుమార్లు సెక్రటరీలకు సంఘం సభ్యులు వినతి పత్రాలు అందజేశారు. కాని రాష్ట్రప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుండడంతో, వాటిని సాధించుకునేందుకు గురుకుల టీచర్ల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వంతో ఫైట్ చేయాలని నిర్ణయించాయి. ఇక నుంచి ఉమ్మడి పోరాటం చేయనున్నట్టు సంకేతాలు ఇస్తున్నాయి. తెలంగాణ గురుకుల సొసైటీతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లోని సమస్యల పరిష్కారానికి ఒకటి కాదు.. ఏకంగా రెండు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లు ఏర్పాటు కావడం విశేషం. ఇందులో లెఫ్ట్ పార్టీలకు చెందిన వర్గం ఒకటైతే, నాన్ లెఫ్ట్ పార్టీలకు చెందిన వర్గం మరొకటిగా చెప్పుతున్నారు. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందిన జేఏసీ నాయకులు బాలరాజు, రుషికేశ్‌కుమార్, కే సంజీవ్, సైదులు, బాలరాజ్ మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి, సంబంధిత శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు.. రెండో జేఏసీ వర్గానికి చెందిన నాయకులు మాట్లాడుతూ.. డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని, అందు లో భాగంగా ఈ నెల 28న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. కొనసాగింపుగా హైదరాబాద్‌లో 'మహాధర్నా' నిర్వహిస్తున్నట్టు ఆ జేఏసీ తరపున యూటీఎఫ్-గురుకుల టీచర్ల జేఏసీ నాయకులు జంగయ్య, చావ రవి, గురుకుల టీచర్ల జేఏసీ తరపున మామిడి నారాయణ, మధుసూదన్ తెలిపారు.



హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు.
ఈ సందర్భంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని హరీశ్‌రావుకు వివరించారు.

ట్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాటం

మొదటిపేజీ తరువాయి...

వేళ భువనగిరి సభలో ప్రియాంకతో ఇప్పించిన హామీని కూడా విస్మరించడం బాధాకరమని చెప్పారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తీరు 'ఓడ దాటే దాకా ఓడ మల్లన్న..ఓడ దాటినంక బోడ మల్లన్న' చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లతో జంక్షన్ ఏర్పాటు చేయడం, 78 ఎకరాల్లో ఉన్న జంక్షన్ రింగురోడ్డును 184 ఎకరాలకు పెంచడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ రెండుగా చీలిపోతుందని చెప్పారు. రైతులు రెండు పంటలు పండే భూములు, విలువైన ప్లాట్లు కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. బాధితులకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తున్నదని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారని గుర్తుచేశారు. కానీ అధికారం రాగానే అదే రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

కోమటిరెడ్డికి మతిమరుపు ఎక్కువైంది..

'కోమటిరెడ్డికి కొంతకాలంగా మతిమరుపు ఎక్కువైనట్టున్నది..ఆయన ఇచ్చిన హామీల వీడియోలు పంపుతున్నా..చూసుకోండి' అంటూ చురకలంటించారు. 'కోమటిరెడ్డి.. ఇప్పటికైనా స్పందించు..ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పించి నల్లగొండ వాసులకు న్యాయం చేస్తావా? లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోదల్చుకున్నావా? తేల్చుకోవాలని సూచించారు. దక్షిణాన ట్రిపుల్ ఆర్‌కు ఏ విధంగానైతే 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకున్నారో, ఉత్తర దిక్కున కూడా 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్, ఇప్పుడు పోలీసు బలగాల మధ్య సర్వే చేయించి బాధిత రైతులతో దుర్మార్గంగా ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టించారని ధ్వజమెత్తారు. 'ఎన్నికల ముందు ఓ మాట? ఎధికారంలోకి వచ్చాక మరో మాటనా? ఇదెక్కడి న్యాయం' అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ విషయంలోనూ ఇదేవిధంగా మాట మార్చారని విమర్శించారు. 'మాట మార్చడమే మీ విధానామా? మభ్యపెట్టడమే కాంగ్రెస్ పద్ధతా?' అని నిలదీశారు. పరిహారం ఇవ్వాలని ప్రశ్నించిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నదని చెప్పారు. ప్రియాంక గాంధీ చొరవ చూపి ట్రిపుల్ ఆర్ బాధితుల సమస్యలు పరిష్కరించేలా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి కోమటిరెడ్డికి ఆదేశాలివ్వాలని హరీశ్ విజ్ఞప్తిచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరిచి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు రేవంత్ కేసు విచారణ

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును నాంపల్లిలోని ప్రజాప్రతిధుల కోర్టు బుధవారం విచారించనున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రూపుమాపేందుకు బీజేపీ కంకణం కట్టుకున్నదని మే 4న కొత్తగూడెం బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ఆరోపించడంపై బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కోర్టును ఆశ్రయించారు. బీజేపీ ప్రతిష్ఠకు కలిగేలా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం సభలో రేవంత్ ప్రసంగానికి సంబంధించిన క్లిప్లింగ్‌లను కోర్టుకు సమర్పించారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 499, 125 సెక్షన్ల కింద రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైంది. దీనిపై విచారణకు సీఎం రేవంత్ లేదా ఆయన తరపు న్యాయవాది హాజరు కావాలని గత నెల 25న కోర్టు ఆదేశించింది.

16న కోర్టుకు రేవంత్ రావాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

తరుపు న్యాయవాదిని ఆదేశించారు. ఇదిలాఉండగా నిందితుల తరుపు న్యాయవాది గైర్హాజర్ పిటిషన్లు దాఖలు చేయడంతో కోర్టు అంగీకరించింది. 2015 మే 31న ఓటుకు నోటు కేసులో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌కు నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్టు అభియోగాలున్నాయి. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహా, సండ్ర వెంకటవీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు నోటు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈడీ కోర్టు విచారణకు నిందితులు కొంతకాలంగా హాజరు కావడం లేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మిగతా నిందితులు సైతం కోర్టుకు హాజరుకాకుండా, గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీనిని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. నిందితులు కోర్టుకు హాజరుకాకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండిపడింది. మరోవైపు, ఏసీబీ నమోదుచేసిన ఓటుకు నోటు కేసు విచారణ కూడా నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్నది. ఈ కేసులో ఏ-1 నిందితుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

వేలానికి అరుదైన నెక్లెస్

- 18వ శతాబ్దపు భారత వజ్రాలతో తయారీ

లండన్, సెప్టెంబర్ 24: భారత్‌కు చెందిన 500 వజ్రాలను పొదిగించి తయారు చేసిన 18వ శతాబ్దం నాటి ఒక రహస్యమైన నెక్లెస్‌ను నవంబర్‌లో జెనీవాలో అమ్మకానికి పెడుతున్నారు. వాటిలో కొన్ని ఫ్రాన్స్ రాణి మేరీ ఆంటోయినెట్ మరణానికి దోహదపడిన ముక్క నుంచి తీసుకున్నట్టు నమ్ముతారు. ఈ అరుదైన నెక్లెస్‌ను రాజ కుటుంబం వారు ఇప్పటివరకు రెండు ప్రముఖ సందర్భాలలో మాత్రమే ధరించారు. ప్రస్తుతం ప్రైవేట్ కలెక్షన్‌లో ఉన్న దీనికి సంబంధించిన ఆన్‌లైన్ బిడ్డింగ్ అక్టోబర్ 25న ప్రారంభమవుతుంది. మూడు వరుసలతో ఉండి ప్రతి చివరా డైమండ్ పెండెంట్‌తో పూర్తి చేసి ఉండే ఈ అరుదైన నెక్లెస్ 50 ఏండ్ల తర్వాత బహిరంగంగా సోమవారం అందుబాటులోకి వచ్చింది. దీనిని లండన్‌లో బుధవారం వరకు ప్రజల దర్శనానికి అందుబాటులో ఉంచుతారు. అనంతరం దీనిని హాంకాంగ్, న్యూయార్క్, తైవాన్‌లలో బహిరంగంగా ప్రదర్శిస్తారు. ఇది సుమారు 15 నుంచి 23 కోట్ల రూపాయల ధర పలుకుతుందని అంచనా వేస్తున్నారు.

ఉదండాపూర్ భూనిర్వాసితుల ఆందోళన

- మూకుమ్మడిగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరిక
- 'మల్లన్నసాగర్' ప్యాకేజీలా ఇవ్వాలని డిమాండ్
- ఆ తర్వాతే పనులు చేపట్టాలని రైతుల సూచన
- నేడు ఉదండాపూర్ పరిశీలనకు మంత్రులు

జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'పాలమూరు-రంగారెడ్డి' ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వల్లూరు, ఉదండాపూర్‌కు చెందిన ముంపు నిర్వాసితులు మూకుమ్మడిగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి డబ్బులు, ప్లాట్లు ఇచ్చిన తర్వాతే రిజర్వాయర్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్‌తోపాటు నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్ల పనుల పరిశీలనకు ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. మంత్రుల పర్యటనను అడ్డుకుంటారన్న అనుమానంతో పోలీసులు నిర్వాసితులను పోలీస్‌స్టేషన్‌కు రావాలని సీఐ ఆదిరెడ్డి సూచించారు. దీంతో వారంతా పోలీస్‌స్టేషన్‌కు చేరారు. తమకు ఎందుకు పిలిచారని ఆందోళన చేపట్టడంతో.. వారందరినీ ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వద్దకు రావాలని పోలీసులు సూచించడంతో అక్కడికి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పిన విధంగా మల్లన్నసాగర్ ముంపు బాధితులకు ఇచ్చిన ప్రకారం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ కంఠంలో లేకుండా.. ఇతర భూముల్లో ఉన్న ఇండ్లకూ షరతుల్లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. పరిహారం చెల్లించాకే పనుల వద్దకు రావాలని సూచించారు. మంత్రుల పర్యటన విజయవంతం అయ్యేందుకు సహకరించాలని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు నిర్వాసితులను కోరారు. సమస్యలుంటే మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు.

సియస్ఐఆర్-జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ

మీ అందరినీ
సియస్ఐఆర్ - ఎన్ జి ఆర్ ఐ ఓపెన్ డే
సందర్భంగా సాదరంగా ఆహ్వానిస్తోంది.

26 సెప్టెంబర్ 2024
ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు
(ప్రవేశం మధ్యాహ్నం 2.30 గంటలకు ముగుస్తుంది)

వివరాలకు సంప్రదించండి:
ఇన్స్పెక్షన్ డివిజన్
040-27012796/27012364

సియస్ఐఆర్ - జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ
(వైజ్ఞానిక మరియు పారిశ్రామిక పరిశోధనా మండలి)
ఉప్పల్ రోడ్, హైదరాబాద్ - 500 007
ఈ క్రింది వాటిపై మమ్మల్ని అనుసరించండి
www.ngri.res.in facebook.com/csirngrihyd twitter.com/csirngri youtube.com/@csir-ngri/featured
అధిక వివరాల కోసం ఈ-మెయిల్: information@ngri.res.in పై మిమ్మల్ని సంప్రదించండి